# ఇది అన్యాయం కాదా?

## 'వాచస్పతి'

*తీగను కదిపితే డొంకంతా కదిలిందంటే లోపం ఎక్కడున్నట్లు?*

"అమ్మా! సురేష్ వచ్చాడు'" అంది హారతి ఉత్సాహంగా. వంటింట్లో పనిలోవున్న విమలమ్మ చెవులకు ఆ మాటలు అమృతపు సోనల్లా తాకాయి. అంతవరకూ మోయరాని బరువేదో మోస్తున్నట్లు అనిపించిన ఆమెకు ఆ బరువేదో తొలగిపోయినట్లు తేలిగ్గా ఊపిరి తీసుకుంది. కళ్ళల్లో, ముఖంలో సంతోషం పిచ్చిగంతులు వేసింది. రెండంగల్లో ముందు గదిలోకొచ్చి, కొడుకు ముఖంలోకి ప్రేమగా, పరిశీలనగా చూస్తూ 'వచ్చావురా!' అంది సంతోషాన్ని దాచుకోలేక.

ఈజీ చేర్లో పడుకుని, ఆ రోజు పేపరు చూస్తున్న కమలాకర్రావు పేపరు ప్రక్కన పడేసి, కొడుకు ముఖంలోకి ఓరగా, పరీక్షగా చూశాడు. అతనిలో రకరకాల సందేహాలు, భయాలు తలెత్తాయి.

సురేష్ ముఖం వాడిన పువ్వులా వుంది. నూనూగు మీసాల నూత్న యౌవన శోభతో మెరిసిపోవలసిన ముఖంలో, కన్నుల్లో ఏదో నిరాశ, నిస్సహాయత, అలసట, విచారం ఒకదానితో ఒకటి దోబూచులాడుతున్నాయి. ఏదో చెప్పాలని ప్రయత్నించి, ఎందుకో ఆ ప్రయత్నం మానుకున్నాడు సురేష్

"అమ్మమ్మావాళ్ళంతా బాగున్నారట్రా? ఏమిటలా వున్నావ్?" ఆందోళనగా ప్రశ్నించింది విమలమ్మ.

"ఎలా వున్నాను?" తల్లి వేపుచూస్తూ, రాని నవ్వును బలవంతంగా ముఖంమీదకు తెచ్చుకుని అన్నాడు సురేష్.

"నాలుగు రోజుల్లో వస్తానన్నవాడివి.... ఇన్నాళ్ళు ఏం చేస్తున్నావు?" కళ్ళద్దాలు తీసి చేతితో పట్టుకుని, కొడుకు ముఖంలోకి నిశితంగా చూస్తూ అడిగాడు కమలాకర్రావు.

సురేష్ జవాబు చెప్పలేదు.

చూపులువాల్చి మౌనంగాఉండిపోయాడు.

మనసులో ఏదో తీవ్ర సంఘర్షణ చెలరేగుతున్నట్లు ముఖం. కళ్ళు చెప్తున్నాయి.

"విన్నేరా?"

"ఇక్కడకు వచ్చి చేసేదిమటుకేముందని...." నసిగాడు. భార్యాభర్తలిద్దరూ ఒకరి ముఖంలోకి ఒకరు అర్థంకానట్లు చూసుకున్నారు కొద్దిక్షణాలు.

"కాలేజీ నుంచి ఇంటర్వ్యూకు రమ్మని కార్డు వంపారు, సూరీ!" కార్డుకోసం వెదుకుతూ అంది హారతి.

అది విన్నాక కూడా సురేష్ ముఖంలో ఏలాంటి ఉత్సాహం వ్యక్తం కాలేదు. నేల చూపులు చూస్తూ మౌనంగా ఉండిపోయాడు.

"ఏమైందిరా?" కొడుకు ధోరణికి తల్లి మనసు తల్లడిల్లి పోయింది.

"ఏంవైంది?" విసుగ్గా చూస్తూ అన్నాడు.

"అమ్మమ్మ బాగుందా?"

"అంతా బాగున్నారు!" కంఠంలో కోపం, నిష్ఠూరం.

"ఎప్పుడు బయల్దేరావు? ఇంత ప్రొద్దు పోయిందేం?" కొడుకు ధోరణికి కారణాలు ఆలోచిస్తూ అడిగాడు తండ్రి.

"మూడు గంటల బస్సుకు బయల్దేరాను. బస్టాండ్‌లో హేమంత్ కనిపిస్తే వానితో మాట్లాడుతున్నాను...."

"హేమంత్ కూడా బి. కాం.లో చేరతాడటనా?" ఇంటర్‌వ్యూ కార్డు తెచ్చి సురేష్‌కిస్తూ అడిగింది హారతి.

"వానికేం ఖర్మపట్టింది? పాతికవేలు డొనేషన్ కట్టి వాళ్ళ నాన్న ఇంజనీరింగ్‌లో చేర్చబోతున్నాడట!" అని తండ్రి ముఖంలోకి క్షణకాలం చూసి, చూపులు వాల్చుకున్నాడు.

కానీ—హృదయంలో మటుకు ఆవేదన సాగరంలా పొంగింది.

ఆశాసౌధం ముక్కలు ముక్కలై కూలిపోయింది-ఆ శిథిలాలమీద నిరాశ, నిస్పృహ రాజ్యం చేస్తున్నాయి.

"ఓ! అదన్నమాట వీని ఈ వైఖరికి కారణం!" మనసులో అనుకుని, మెల్లగా నిట్టూర్చి "డబ్బువున్నవాళ్ళకు చదువుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది కొత్త విషయం ఏంకాదు" అన్నాడు కమలాకర్రావు.

"జయారావుకు రిజర్వేషన్‌లో సీటొచ్చిందట...."

ఈసారి కళ్ళెత్తకుండానే మెల్లనికంఠంతో అన్నాడు.

విమలమ్మ గుండెలో ముల్లు గుచ్చుకున్నట్లయింది. హారతి దిగులు నిండిన కళ్ళతో చూసింది తమ్ముని వేపు.

"ఆ విషయం మొదట్నుంచీ అనుకుంటున్నాంగా?" మనసులోని బాధను పైకి కనిపించనీక అన్నాడు కమలాకర్రావు.

"వాళ్ళిద్దరికీ నాకన్నా ఎక్కువమార్కులు

రాలేదు నాన్నా! ఇంటర్‌లో ఒకడికి ఏభై. ఇంకోడికి డెబ్భై పర్సెంట్. ఎన్ట్రెన్స్‌లో ఏ రెండువేల తర్వాతో వాళ్ళ నంబర్లు! అయితే ఏం? ఇంకో నాలుగేళ్ళలో ఇద్దరూ ఇంజనీర్లయిపోతారు!" అలా అంటున్నప్పుడు సురేష్ కళ్ళల్లో నీరు చిప్పిలింది. కంఠం చిత్రంగా వణికింది.

"అదన్న మాట నీ బాధ?" తన బాధను పైకి కనిపించనీక నవ్వి అన్నాడు.

విసురుగా తలెత్తి రోషంగా "బాధేం కాదు!" అని క్షణం ఆగి "అవును, బాధే! ఇలాంటి అన్యాయం యెవరికి జరిగినా బాధ పడతారు!" చివరి మాటలంటున్నప్పుడు కన్నీరు జలజల చెంపలమీద జారింది.

విమలమ్మ హృదయం విలవిల లాడింది.

హారతి కన్నుల్లో నీటిపొర కదిలింది.

కమలాకర్రావు నిరుత్తరుడయ్యాడు.

మునివేళ్ళతో గడ్డం రాసుకుంటూ, ఏం జవాబు చెప్పడమా అని ఆలోచిస్తూండిపోయాడు ఓ నిమిషంపాటు. తర్వాత "కన్నీరు పెట్టుకుని లాభం ఏమిటి చెప్పు? అన్యాయం ఎవరు చేశారు? నీకు అన్యాయమేదన్నా జరిగివుంటే, అది ఆ దేవునివల్ల జరిగివుండాలి" అన్నాడు విచారంగా.

"నిందలన్నీ దేవునిమీద వేయడం చాలా సులభం!" హారతి కోపంగా అంది.

"పాతికవేలు డొనేషన్‌గా కట్టలేని నిర్భాగ్యుణ్ని తండ్రిగా చేయడం ఆ దేవుడు చేసిన అన్యాయం కాదా తల్లీ? లక్షలు సంపాదించలేని అసమర్థుణ్ని నేను. వెనక ఆస్తిపాస్తులు లేవు. వేలకు వేలు వచ్చే ఉద్యోగం కాదు. ఈ రోజుకు తొమ్మిది వందల రూపాయల జీతగాణ్ని అయ్యాను. నాలాంటివాడు డొనేషన్ కట్టాలంటే అవినీతి మార్గంలో డబ్బు సంపాదించవలసిందే. మరో మార్గంలేదు!" అన్నాడు వ్యాకుల కంఠంతో.

"నాన్నా! మీరలా సంపాదించలేదని నేనెప్పుడూ బాధపడలేదు. అన్యాయం కాకుంటే, నా దురదృష్టం అనుకుంటాను" అని గబగబ పెరట్లోకెళ్ళాడు ముఖం, కాళ్ళూ, చేతులూ కడుక్కునే నెపంతో సురేష్.

విమలమ్మ నిలుచోలేక కింద గోడకానుకుని కూచుంది.

సురేష్ పడేసిన ఇంటర్వ్యూ కార్డు తీసుకుని ప్రక్కగదిలోకి వెళ్ళింది హారతి.

కొడుకులో తిరిగి ఆశనూ, ధైర్యాన్ని కలిగించి — ఇప్పుడిప్పుడే మనసులో చోటు చేసుకుంటున్న ఆ ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సును ఎలా పోగొట్టడమా అన్న ఆలోచనలో మునిగిపోయాడు కమలాకర్రావు.

కమలాకర్రావు బి. ఎ. పాసయ్యాక రైల్వేలో క్లర్కుగా చేరాడు. ఈ నాటికి హెడ్‌క్లర్కు అయ్యాడు! ఆయనకు ముగ్గురు పిల్లలు. మొదటి సంతానం హారతి. చిదిమిదీపం పెట్టుకోగల అందం. అంతకన్నా అందమైన, సున్నితమైన మనసు కలది. బి. ఎ. రెండో సంవత్సరం చదువుతోంది. రెండోవాడు సురేష్. చిన్ననాటి నుంచీ పెద్ద పెద్ద ఆశా సౌధాలను కట్టినవాడు! జీవితంలో ఏదో సాధించాలన్న ప్రగాఢమైన కోరికగలవాడు. ఇంటర్ పాసయ్యాడు. ఆఖరి సంతానం రాజేష్. సినిమా పిచ్చి ఎక్కువగా ఉంది. రాజేష్ ఖన్నాలా సినిమా యాక్టర్ అయిపోవాలన్నది ఆ అబ్బాయి జీవితాశయం. టెన్త్ క్లాస్‌లో ఉన్నాడు.

సురేష్ చాలా తెలివైనవాడని, కమలాకర్రావు దంపతులు చెప్పడం కాదుగానీ, ఉపాధ్యాయులూ, ఆ అబ్బాయి స్నేహితులూ, పరిచయస్తులూ అంతా ఒప్పుకున్న విషయం. లెక్కలు వాని అభిమాన విషయం. ఆ సబ్జెక్టులో మానాపోలీలా ఎప్పుడూ సురేష్‌కే ఫస్ట్ మార్కు. మరొకరికి ఆ అవకాశాన్ని యివ్వడు!

"మీవాణ్ణి ఇంజినీరు చేయాలండీ కమలాకర్రావుగారూ!" అనేవారు సురేష్ ఉపాధ్యాయులు.

"నేనెలా చేయగలనండీ! వాడు కావాలిగానీ!" అనేవాడు కమలాకర్రావు సంతోషాన్ని నవ్వు వెనక దాచుకుంటూ.

విమలమ్మ సరేసరి "మా సురేష్‌ను ఇంజినీరు చదివిస్తామండీ!" అని చెప్పేది ఇరుగు పొరుగుతో, బంధువులతో. సురేష్ ఎప్పుడన్నా లెక్కల హోంవర్కు దీక్షగా చేస్తున్నప్పుడు, "అబ్బ! ఇంజనీరుకు చుట్టుప్రక్కల ఏం జరుగుతుందో కూడా తెలియడంలేదే!" అని హాస్యమాడేది హారతి.

ఐదారు తరగతుల్లో ఉన్నప్పుడే సురేష్ లేతమనసులో, బుల్లితలలో ఇంజినీరు కావాలన్న కోరిక ప్రగాఢంగా నాటుకుపోయింది. వాని వయసుతోపాటు ఆ కోరికా పెరుగుతూ మనసులో లోతుగా పాతుకుపోయి - చిన్న చెట్టై, క్రమంగా మహావృక్షమై, శాఖోపశాఖలుగా విస్తరించింది!

ఆ మహావృక్షాన్ని భయంకరమైన పరిస్థితుల పెనుతుపాను వేళ్ళతో సహా పెకిలించి కూలదోసిందీరోజు. మహావృక్షం నేలకూలినప్పుడు, భూమాత మనసులాగే సురేష్ మనసూ ముక్కలై రక్తసిక్తమైంది.

"ఇంజినీరు కావాలంటే ఏం చెయ్యాలి?" అన్నసందేహం తరచుగా కలిగేది బాల్యంలో సురేష్‌కు. సందేహ నివృత్తి కోసం ఓరోజు తండ్రి నడిగాడు.

"ఏముంది? బాగా చదువుకోవాలి? లెక్కల్లో నూటికి నూరు రావాలి".

"నూటికి నూరా?"

"పోనీ, తొంభై!" నవ్వుతూ అన్నాడు.

"నా కెప్పుడూ తొంభై పైనేగా?"

కళ్ళల్లో కాంతి తళతళలాడుతుండగా సగర్వంగా అన్నాడా కాబోయే ఇంజినీరు!

"అయితే, ఇక ఇంజినీరువై పోయినట్టే!"

అలాగే అనుకున్నాడు కమలాకర్రావు.

ఏడెనిమిది సంవత్సరాల క్రిందట పరిస్థితులు వేరు. అప్పుడు ఇంత కాంపిటీషన్ లేదు. ఉన్న ఊళ్ళోనే ఇంజినీరింగ్ కాలేజీ ఉంది. కొడుకు తెలివిగలవాడుగనక, సీటురావడం కష్టమేం కాదనుకున్నాడు. గవర్నమెంటు కాలేజీ గనక ఫీజులు తక్కువ. ఆమాత్రం ఫీజు కట్టి పుస్తకాలు కొనగలడు తను. అంతగా అయితే, విమలా, తనూ కొన్ని

## జ్వలిత జ్వాల

నా హృదయాంతర్భాగములో
చిన్నగా జ్వలించే దీపానివి నీవు!
చీకటిలాంటి నా మనసుని
ప్రకాశింపచేస్తూ ఎంత ప్రశాంతంగా
వెలుగుతున్నావో!
సర్వస్వాన్నీ సముజ్వలింపచేసే
నీ బంగరు వెలుగుకు నేను లోబడు
తున్నాను!



కాని....
ఒక రాత్రి....
తీవ్రానల జ్వాలలతో
నిప్పురవ్వలను కక్కుకుంటూ
నా ఆశలను, బంగరు కలలను
కాల్చివేస్తూ-
తటాలున వచ్చావు నీవు,
మసిమైపోయిన నా అవశేషాలను
వెనుకకు విడిచిపెట్టి!

— శశిబాల

కాని, కళ్ళు ఎదుటే పరిస్థితులు తారుమారై పోయాయి.

కాంపిటేషన్ రోజు రోజుకూ పెరుగుతున్న బంగారం ధరలా పెరిగి పెరిగి, ఆకాశంలోని చుక్కలతో స్నేహం చేస్తోంది.

ఇంగ్లీషు మీడియం స్కూల్సు, డొనేషన్ కాలేజీలూ ఇండియా జనాభాలా పెరిగిపోయాయి!

గవర్నమెంటు ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల్లో ఎంట్రెన్సు పరీక్షలు వ్రాసి సీటు సంపాదించటంకన్నా, అపోజిషన్ పార్టీలన్నింటినీ ఒక్క త్రాటిమీద నడిపించడం ఎంతో సులభం అనడం అతిశయోక్తికాదు.

ఈ పరిస్థితుల నన్నింటినీ అవగాహన చేసుకుని భయపడిపోయాడు కమలాకర్రావు.

సురేష్ రెండవ సంవత్సరం ఇంటర్‌లోకి వచ్చాడు.

ఎంట్రెన్సు పరీక్షలు ప్రవేశపెట్టారు.




కొన్నిసుఖాలను త్యాగం చేయగలరు అనుకొని కొడుకు ఇంజినీరు అయిపోయినట్టే సంతోషంగా, ధైర్యంగా రోజులు గడప సాగాడు కమలాకర్రావు.

"ఇది మంచి పద్ధతే! తెలివిగలవాడు, మజ్జిగ చిలకగా వెన్న తేలినట్లు పైకి తేల్తాడు!" అన్నారు కొందరు.

"ఏమో! లోపాలేమీ లేకపోతే గదా?" అన్నారు కొందరు భయంగా, సందేహంగా.

"లోపాలేమున్నాయి! అంతా కంప్యూటర్లతో జరిగే పని" అని కొందరు ఆ పద్ధతి పట్ల తమ సంతృప్తిని వెల్లడించారు.

"కంప్యూటర్లవద్దకు వెళ్ళే ఎన్ని చిత్రాలైనా జరగవచ్చు!"— ఇది మరి కొందరి భయం.

ఇవన్నీ వింటుంటే కమలాకర్రావు గుండె జారిపోయింది. కొడుకుకు సీటు దొరుకుతుందా అన్న అనుమానం మొదటిసారిగా అతనిలో కలిగింది. ఏం చేయాలో తోచక స్నేహితులను సలహా అడిగాడు. కోచింగ్ ఇప్పిస్తే మెరిట్‌లో రావచ్చన్నారు కొందరు.

"గుంటూరు పంపవయ్యా! అక్కడ బాగా కోచింగ్ ఇస్తారు. వెయ్యో రెండు వేలకు వెనకా ముందాడితే కొడుకు ఇంజనీరెలా అవుతాడు?" అన్నారు మరీ దగ్గర స్నేహితులు.

చాలా రోజులు ఆలోచించాక అదే సరైన మార్గం అనిపించింది కమలాకర్రావుకు. సురేష్ ఇంటర్ పరీక్షలు వ్రాయగానే గుంటూరుకు పంపాడు. అక్కడ కోచింగ్ క్లాసుల్లో ఎప్పుడూ మంచి మార్కులే తెచ్చుకునేవాడు. "నువ్వు మెరిట్‌లో తప్పక వస్తావోయ్!" అన్నారు అధ్యాపకులంతా.

సంతోషంతో, సంతృప్తితో వాటిని మించిన నమ్మకంతో గృహోన్ముఖుడయ్యాడు.

ఇంటర్‌లో తొంభై పర్సెంట్ మార్కులొచ్చాయి.

ఎంట్రెన్సు పరీక్షలూ వ్రాశాడు.

ఏడువందలపైన రాంకులో వచ్చాడు.

"ఆరువందల యాభై వరకే మేం తీసుకునేది" అన్నారు అధికారులు.

కమలాకర్రావు తల గిర్రున తిరిగిపోయింది.

"ఇంత శ్రమా బూడిదలో పోసిన పన్నీరేనా?" అని విపరీతంగా బాధపడ్డాడు. విమలమ్మ కుప్పకూలిపోయింది.

హృదయంలో ఎంతో అపురూపంగా పెంచుకుంటున్న అందమైన రంగు రంగుల విహంగాన్ని యెవరో తుపాకితో క్రూరంగా కాల్చి వేసినట్లు విలవిల్లాడిపోయాడు సురేష్.

సుందరమైన కలలూ. ఊహలూ కరిగిపోయి. చివరకు రూపమే లేకుండా అదృశ్యమైపోవడంతో- లోకమంతా శూన్యంగా, భవిష్యత్తంతా గాఢాంధకారంగా అనిపించి దిక్కుతోచని స్థితికి వచ్చాడు. నిరుత్సాహానికీ, నిరాశకూ ప్రతిరూపమే అయ్యాడు. గది వదలి ఇవతలకు రావడం మానేశాడు. తనలో తాను కుమిలి కుమిలిపోయాడు.

విమలమ్మ బలవంతం మీద కాస్త ఎంగిలిపడేవాడు.

నాలుగో రోజున అన్నం తీసికెళ్ళిన తల్లితో—"ఇక నే చదవను!" అన్నాడు.

పిడుగు పడినట్లయింది విమలమ్మ తల మీద.

కొన్ని క్షణాల తర్వాతగానీ తననుతాను పూర్తిగా సంభాళించుకోలేకపోయింది.

"ఏవిటీ?" అన్నది అర్థం కానట్లు.

"ఇక చదవను. అనుకున్నది కాకపోయాక ఇక ఏదైతేనేం?"

"అంటే?"

"ఓ కిళ్ళీకొట్టు పెట్టుకుంటే బ్రతకలేనా?"

జవాబేం చెప్పలేకపోయింది.

కన్నుల్లో నీరు గిర్రున తిరిగింది.

ఆ విషయం భర్తతో చెప్పి వాపోయింది.

కొడుకు "ఇంజినీరు కాకుంటే పోయె. మామూలు మనిషై నలుగురిలో తిరిగితే చాలు దేవుడా!" అని మనసులో వెయ్యి దేవుళ్ళకు మొక్కుకున్నారు భార్యా భర్తా.

ఆ సాయంత్రం తండ్రి గదిలోకిరాగానే సురేష్ గోడవేపు తిరిగి పడుకున్నాడు.

"ఎంతసేపలా పడుకుంటావు? లేచి అలా వెళ్ళిరా— కాసేపు."

"ఎందుకు? అంతా నవ్వేందుకా?" తీవ్ర కోపస్వరంతో అన్నాడు సురేష్.

"ఎందుకు నవ్వుతారు?"

## వేదన

కాలం కొలిమిలో కరిగిన జీవితం
మనోదర్పణంపై అస్పష్టంగా
దృశ్యాదృశ్యంగా పాదరసమై
కదలాడడం మినహా మరేముంది?

నిన్నటి ఉద్విగ్న మానసం
నేడు కేవలం జడమైన స్పృహ
కాలం జ్ఞాపకాల పొతర
స్పృహ కన్నీళ్ళతో త్రవ్వి
వెక్కి వెక్కి ఏడుస్తుంది



కాలం కలల పవనం.
మనో సంక్షుభిత కడలిపై
వీస్తుంది వెర్రిగాలిలా

కాలం అంతంలేని అడక తెర
దాన్లో చిక్కుకుంది పోకచెక్క
జీవితం

దిగంతాలకు విస్తరించిన కాలపు
ఎడారిలో
అక్కడక్కడ ఆకుపచ్చని జ్ఞాపకాలు
నా స్పృహ నావాళ్ళ పాదముద్రలకై
అనంతంగా కన్నీళ్ళతో వెతుకుతుంది
చీకటి పొరలలోకి అశక్త మౌనంగా
విషాదంగా కాళ్ళు ముడుచుకుంటుంది.

—సి. సుబ్బారావు

"సిగ్గులేక ఇంకా తిరుగుతున్నాడని!" పొంగివస్తున్న దుఃఖాన్ని యెలాగో ఆపుకుని అన్నాడు.

సురేష్ చాలా సెన్సిటివ్. ఆ విషయం భార్యాభర్తలిద్దరికీ తెలుసు. ఈ పరాజయం వాని జీవిత గమనాన్ని ఎలా మారుస్తుందో అన్న భయం, ఆందోళన కలిగాయి వాళ్ళకు.

"ఏం తప్పు చేశావని అంతా నవ్వుతారు?" విచారంగా నవ్వి అన్నాడు.

"గొప్పలు చెప్పుకున్నాడు! గుంటూరు కూడా వెళ్ళి వచ్చాడు! సీటు సంపాదించుకోలేకపోయాడని!" దుఃఖచలిత కంఠంతో అన్నాడు.

"నీవు ఒక్కడివేనా! నీలాగ ఎందరో ఉన్నారు! నీ ప్రయత్నం నీవు చేశావు. రాత్రింబవళ్ళు కష్టపడి చదివావు. కడుపునిండా అన్నం తింటే నిద్రొస్తుందని సరిగ్గా అన్నం కూడా తినేవాడివి కాదుగదా? నువ్వెంత కష్టపడ్డావో మాకు తెలుసు. మీ అమ్మగానీ, నేనుగానీ నిన్నేమన్నా అన్నామా చెప్పు" లాలనగా అన్నాడు.

బ్రతిమాలి, బుజ్జగించి తనగది వదలి ముందుగదిలోకొచ్చి కూచునేటట్టు చేశారు సురేష్‌ను. ఓ వారంరోజులు జరిగాక రాజేష్‌ను తోడుఇచ్చి అమ్మమ్మగారి ఊరికి పంపారు మార్పుగా ఉంటుందని.

అన్నతో వెళ్ళిన రాజేష్ మరునాడే తిరిగి వచ్చాడు. నాలుగు రోజుల్లో తిరిగి వచ్చేస్తానన్న సురేష్ వారమైనా రాకపోయేసరికి, ఇంట్లో అంతా కంగారుపడ్డారు.

ఊరి నుంచి వస్తూ, బస్‌స్టాండ్‌లో హేమంత్‌ను కలుసుకుని, మాట్లాడ్డం జరిగింది. హేమంత్, జయారావు ఇంజినీరింగ్‌లో చేరబోతున్నట్లు తెలుసుకున్నాక అప్పుడప్పుడే ఉపశమిస్తున్న సురేష్ బాధ అధికమైంది. వాళ్ళిద్దరూ సురేష్ క్లాస్‌మేట్స్.

పెరట్లో కెళ్ళిన సురేష్ టవలుతో ముఖం తుడుచుకుంటూ ముందు గదిలోకి రావడంతో కమలాకర్రావు ఆలోచనలు చెల్లాచెదరయ్యాయి.

"మంచినీళ్ళు త్రాగుతావా?" హారతి అడిగింది.


"వద్దు" అన్నాడు తండ్రికి కాస్త దూరంలో వున్న కుర్చీలో కూచుంటూ.

"కాదురా! అంతా ఇంజినీర్లే డాక్టర్లే అవుతారా? ఇంజినీరు కాకుంటే నేం! ఐ.ఎ.ఎస్. పాసై ఓ పెద్ద ఆఫీసరై పోకూడదూ?" అనునయ కంఠంతో అన్నాడు కమలాకర్రావు.

"అక్కడా సిఫారసులూ, రిజర్వేషన్‌లూ ఎన్ని ఉన్నాయో మనకేం తెలుసు?" తలెత్తి తండ్రి ముఖంలోకి చూస్తూ నిష్ఠురస్వరంతో అన్నాడు.

ఓ క్షణం తర్వాత, "అయినా పాసవుతానన్న నమ్మకం ఏముంది?" అన్నాడు.

"నువ్వు పాసుకాకుంటే మరెవరుపాసవుతారు?"




కొడుకు మనసులోని నిరాశను దూరం చేసే వుద్దేశంతో అంది విమలమ్మ.

"అవును. ఇదో ఈ ఎంట్రెన్సులో చూడమ్మా— ఎన్నో రాంకులో వచ్చానో! ఇక చదవడం శుద్ధ దండగ! న్యాయం అసలులేదు. మనలాంటి వాళ్ళ కోరికలు యెప్పటికీ తీరవు" విరక్తిగా అన్నాడు.

కమలాకర్రావుకు కొడుకుకెలా నచ్చ చెప్పాలో తోచలేదు—బాధతో పీగిపోయింది ఆయన హృదయం.

సురేష్‌ను ఇంజినీరును చేయాలని ఎప్పటినుంచి అనుకున్నాడు? ప్చ్! డొనేషన్ కట్టే స్తోమతు తనకులేదు. రెండు మూడు సంవత్సరాలలో హారతి పెళ్ళి చేయాలి. రాజేష్ భవిష్యత్తు తీర్చిదిద్దాలి.

లేకుంటే, ఎలాగో తంటాలుపడి సురేష్ కోరిక తీర్చేవాడే.

చిన్ననాటినుంచీ వాడు కట్టుకున్న ఆశా సౌధం నేలకూలింది.

మరో ఆశ చిగురిస్తుందా?

ఏమో?

కొత్త ఆశ చిగురించేలా చేయాలి.... అదే తను చేయవలసిన పని. అవును. లేకుంటే, వీని భవిష్యత్తు ఏమయ్యేటట్లు?

ఈ ఆవేదన, నిరాశ తనకు అన్యాయం జరిగిందన్న భావం వీణ్ణి ప్రశాంతంగా ముందుకు సాగిపోనిస్తాయా?

వీటి నుంచి జనించిన విద్రోహ భావం, ఏ వక్రమార్గమో పట్టిస్తే?

వీని భవిష్యత్తు నాశనం కాదూ? ఇంత తెలివీ, ప్రతిభా మొగ్గలోనే రాలిపోవలసిందేనా! ఊహూ....

తల విదిలిచ్చి, చూపులు త్రిప్పి కొడుకు ముఖంలోకి చూశాడు. తర్వాత అనునయ కంఠంతో ఇలా అన్నాడు:

"అదికాదురా సూరీ! ఆరువందలయాభై రాంకర్‌కూ, అంటే మెరిట్‌లో సీటు వచ్చిన వాడికీ, నీకూ తెలివి తేటల్లోనూ, నాలెడ్జిలోనూ పెద్దగా వ్యత్యాస ముంటుందని నేననుకోను. నువ్వు వాళ్ళకన్నా తక్కువేం కాదు. అలా యెప్పటికీ అనుకోకు. మనం ఆర్థికంగా వెనకబడిన తరగతికి చెందుతామో, లేదో నాకు తెలియదు. కానీ, డొనేషన్‌కట్టి చదివించే స్తోమతు నాకు లేదు. ఇంజినీరింగే చదివి తీరాలన్న రూలేమీ లేదుకదా?" ఆవేదన అంతా చిరునవ్వులో దాచి ప్రశ్నించాడు.

తండ్రి పడుతున్న బాధ, తపనా, తన మీద ఉన్న అభిమానం అర్థంకాకపోలేదు సురేష్‌కు.

"అలాంటి రూలేమీ లేకపోవచ్చు. కానీ, నాకన్నా ఎంతో తక్కువ మార్కులువచ్చిన వాళ్ళిద్దరూ ఇంజినీర్లు కాబోతున్నారా, లేదా? ఈ పద్ధతిలో ఎక్కడో లోపం ఉన్నట్లు అనిపించడంలేదా? ఇది అన్యాయం కాదా?"

ఈసారి సురేష్ కంఠంలో ఆవేదనకన్నా, ఆవేశమే ఎక్కువగా ధ్వనించింది.

"అవునా! ఒకనికి డబ్బుంది! ఒకనికి రిజర్వేషన్ ఉంది! నీకేముంది? మధ్య తరగతి భేషజం ఉంది.... ఇదో పనికిరాని ఈ అభిమానం ఉంది!" అన్నాడు కోపంగా.

కొడుకు కోరిక తీరలేదే, లేదా తీర్చలేకపోయానే అన్న బాధ కోపంగా మారింది కమలాకర్రావులో.

"అసలే వాడు సీటురాలేదని ఏడుస్తుంటే మధ్య మీ కోపం ఏవిటండీ?" విసుగ్గా, కోపంగా, బాధగా అంది విమలమ్మ.

ప్రస్తుత పరిస్థితుల్లో తను కోపగించుకోవడం, ఏమాత్రం అభిలషించదగ్గ విషయం కాదని వెంటనే గ్రహించాడు కమలాకర్రావు.

"మనలాంటివాళ్ళం డొనేషన్స్ కట్టలేం. మరికొన్ని ఇంజినీరింగ్ కాలేజీలు స్థాపించే ఆర్థిక స్తోమతు ప్రభుత్వానికి లేదా?" తండ్రిని ప్రశ్నించాడు సురేష్.

"ఉందనుకుంటే వుంది, లేదనుకుంటే లేదు!"

"తెలివితేటలు లేకున్నా, డబ్బుంటే చాలునన్నమాట!" కచ్చగా అన్నాడు.

కొడుకు ముఖంలోకి పరిశీలనగాచూస్తూ-

"డొనేషన్స్‌కట్టి చదివే వాళ్ళంతా తెలివి తక్కువవాళ్ళని అర్థంకాదు. మా కాలంలో అలా అనుకున్నా అర్థం ఉంది. కానీ, ఇప్పుడు డెభ్భై, ఎనభై పర్సెంట్ వచ్చిన వాళ్ళూ డొనేషన్స్‌కట్టి చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగింది. పోటీ హెచ్చింది. దానికి అనుగుణంగా కాలేజీల సంఖ్య పెరగలేదు. ఇక రిజర్వేషన్‌లో సీట్లు సంపాదించుకున్న వాళ్ళు తక్కువ మార్కులు వచ్చిన వాళ్ళు కావొచ్చునేమో కానీ, తెలివిహీనులు కాదు. ఉదాహరణకు జయారావును తీసుకో. జయారావు తండ్రి కూలిపని చేస్తాడు. త్రాగుబోతు. వాళ్ళ గృహ వాతావరణం, పరిసర వాతావరణం ఎలాంటివో మనం ఊహించుకోవచ్చు. ఇవి కాక ఆర్థిక దుస్థితి. పుస్తకాలు కొనే శక్తి

## పిచ్చిగీతలు

ఓిల్లరంతా జారిపోయాక
జేబు చిరిగిన విషయం తెలుస్తుంది.
సమయం కాస్తా దాటిపోయాక
ఆవేశం ఆయాసంగా మిగులుతుంది.



నీ పీడే విన్నా విడిచిపెట్టి
కాలుమీద కాటెయ్యబోతుంది.
వంకరగా మలుపు తిరుగుతున్నప్పుడు
నువ్వెక్కిన రైలే విన్నా తరుము
కొస్తుంది!

—అదృష్టదీపక్

లేనివాడు, ట్యూషన్ ఏం పెట్టించుకోగలడు? కోచింగ్ క్లాసులకు ఎలా వెళ్ళగలడు? నీకన్నా, హేమంత్‌కన్నా ఎక్కువ మార్కులు జయారావుకెలా వస్తాయి చెప్పు?" అన్నాడు కమలాకర్రావు అనునయ కంఠంతో.

అన్యాయం జరిగిందన్న భావం కొడుకు మనసులో అలాగే నిలచిపోకూడదని ఆయన వుద్దేశం.

ఆలోచిస్తూ మౌనంగా వుండిపోయాడు సురేష్.

"ఒక ఊరికి వెళ్ళాలనుకుంటాం. మనం వెళ్ళాలనుకున్న దారి మూసివేశారు. మరో దారిన వెళతామా, లేక ప్రయాణం మానుకుంటామా చెప్పు?" అని చిరునవ్వుతో ప్రశ్నించిన తండ్రి ముఖంలోకి అర్థం కానట్టు చూశాడు సురేష్.

ఆ చూపుల నర్థంచేసుకున్న కమలాకర్రావు—

"ఐ.ఎ.ఎస్. పరీక్ష వ్రాయి. లేదా, సి.ఎ. చెయ్యి. అదీ కాదనుకుంటే సైన్సులో

## మనవి

[డొనేషన్స్ కట్టి చదివే వాళ్ళను విమర్శించడం నా ఉద్దేశం కాదు. రిజర్వేషన్స్‌కు వ్యతిరేకినీ కాను. ఈ కథ వ్రాయడంలో ఒక ఉద్దేశం— ప్రభుత్వమూ, విద్యావేత్తలూ సురేష్‌లాంటివాళ్ళకు ఏదన్నా మార్గం చూపగలరేమోనని— డొనేషన్స్ నిషేధిస్తామంటున్నారు. అది ఎంత సత్వరంగా జరిగితే అంత మంచిది. రెండవది- అతి ముఖ్యమైనది. సురేష్‌లాంటి యువకులు ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు, బిట్టర్‌నెస్, ఫర్‌వెర్టెడ్‌నెస్, నిరాశ నిస్పృహలు మొదలైన వినాశకరమైన భావాలకు లొంగిపోక భవిష్యత్తును ఉజ్జ్వలంగా చేసుకోమనీ, ప్రయత్నిస్తే తప్పక చేసుకోగలరనీ చెప్పడమే. ఇందుకు తలిదండ్రులూ, పెద్దలూ, ఉపాధ్యాయులూ చేయూతనివ్వాలి.

—'వాచస్పతి']

ఏ శాఖలోనో పి. హెచ్ డి. చేసి పెద్ద సైంటిస్టువుకా...."


నిర్లిప్తంగా నవ్వాడు సురేష్.


"సూరీ ! నువ్వు ఐ.ఎ.ఎస్సే. చదవాలి, కలెక్టరు కావాలి ! నువ్వు కలెక్టరయ్యాకే, నేను పెళ్ళిచేసుకుంటాను !"

మనసులోని బాధనూ, నిరాశనూ మృదుమధురహాసంగా మార్చి అంది హారతి.

ఆ మాటలకు సురేష్‌కు నవ్వొచ్చింది.

"ఓహో ! కలెక్టరు అక్కగారిగా, అత్తారింట్లో ఎక్కువ అధికారం చెలాయించ






వచ్చునని కాబోలు నీ ఆశ !"

అందుకు అంతా మనసారా నవ్వారు.

అందరి హృదయాలలోనూ దట్టంగా అలముకున్న విచారపు కారు మేఘాలు తాత్కాలికంగా చెల్లా చెదరయ్యాయి.

"ఇక లేవండి భోంచేద్దురు." అలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తున్న విమలమ్మ దాన్ని జారవిడుచుకోదలచలేదు.

"రాజేష్ ఏడమ్మా ?" తల్లివేపు చూపులు త్రిప్పి అడిగాడు సురేష్.

"సినిమా కెళ్ళాడు."

"ఆదివారం కదూ ? ఆ విషయమే మరచిపోయాను !" చిన్నగా నవ్వి అన్నాడు.

తల్లీ, కూతురూ ఇద్దరూ భోజనంఏర్పాట్లు చేసేందుకు లోపలికి వెళ్ళారు.

కమలాకర్రావు క్రింద పడేసిన పేపరు చేతిలోకి తీసుకున్నాడు.

అయినా, మనసు దానిమీదలేదు.

ఎన్నో ఆలోచనలు, సందేహాలు.

సురేష్‌కు నిజంగా అన్యాయం జరగలేదా? వీరికన్నా తక్కువ మార్కులొచ్చిన వాళ్ళు ఇంజినీర్లు కాబోతున్నారు. వీణ్ణేమో పనికిరావు పొమ్మన్నారు! ఈ అన్యాయాన్ని సరిదిద్దే ఆలోచన ప్రభుత్వానికుందా ?

మరికొన్ని ఇంజినీరింగ్ కాలేజీలను స్థాపించే ఆర్థిక స్తోమత గవర్నమెంటుకు నిజంగా లేదా ? నిన్న పేపర్లో చదివాడు—బుద్ధ జయంతికోసం ప్రభుత్వం నూటపది కోట్లు ఖర్చు చేయబోతోందట ! ఇలాంటివెన్నో !

తనకు బుద్ధుడన్నా, గాంధీజీ అన్నా ఎనలేని భక్తి.

కానీ, పిల్లల్లో వికసించనున్న ఆశల మొగ్గలను తుంపివేసి ఏవో ఆర్భాటాలను, హంగామాలను చేసినంతమాత్రాన బుద్ధుడు, గాంధీజీ హర్షిస్తారా?

ఇదేనా వీళ్ళను గౌరవించే విధానం ? వాళ్ళు నడిచిన బాటలో నడవడం అన్నింటినీ మించిన గౌరవమవునా కాదా!

ధరలను అరికట్టి, డి.ఎ.లను పెంచడం ఆపేస్తే ఎన్ని కోట్ల రూపాయలు మిగుల్తాయి? సమ్మెలు లేకుండాచేసి ఉత్పత్తిని పెంచితే మరెన్ని కోట్ల రూపాయలు లాభిస్తాయి?

ప్రతిపనీ సకాలంలో జరిగేటట్లు చూస్తే మరెన్ని కోట్లు మిగిలించవచ్చు ?

పన్నులు సరిగ్గా విధించి, ఖచ్చితంగా వసూలుచేస్తే ఎన్నో ఇంజినీరింగ్ కాలేజీలను స్థాపించవచ్చును కదా ?

పవిత్రమైన విద్యారంగాన్ని వ్యక్తుల చేతుల్లోపెట్టి దాన్నో వ్యాపారంగా మార్చడం ఎందుకో! ప్చ్! సురేష్ మనసులో ఎంత బాధపడుతున్నాడో.

"నాన్నా ! సూరీ ! ఇక లేచిరండి ! అన్నం చల్లారిపోతోంది" లోపల్నుంచి కేకేసింది హారతి.

"వస్తున్నాం!" అంటూ ముందు నడిచాడు కమలాకర్రావు.

తండ్రి ననుసరించాడు సురేష్.

ఒకదారి మూసివేయబడింది. మరోదారి ఏది ! అన్న ఆలోచన సురేష్‌లో కలిగినా,

"నీ కిప్పుడు అన్యాయం జరగలేదా ! ఇకపై మటుకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఏముంది ?" అని పదే పదే ప్రశ్నించసాగింది మనసు.

అయినా చిరుదివ్వెలాంటి ఆశ, అయోమయంగా ఉన్న భవిష్యత్ మార్గం పై సన్నని కాంతిని ప్రసరింపజేయడం ఆశ్చర్యకరమైన విషయం!


# ఇది మీకు చాలా ఉపయోగం

మీ నిత్య వ్యవహారాలకు "వ్యవహారదర్శిని" అనే తెలుగుపుస్తకం చాలా ఉపయోగం. అందులో ఇళ్ళు స్థలాలు కొనేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, వీలునామా వ్రాయటం, వ్యాపారం చేయాలంటే, దేనికెవరి వద్ద ఎలా రిజిస్టరు చేసుకోవాలి, వివిధ జాతుల వివాహ, విడాకుల నిబంధనలు, స్త్రీ పురుషుల ఆస్తి హక్కులు, ఎవరికైనా ప్రమాదం వాటిల్లితే పోలీసు రక్షణకు ఎవరిని ఆశ్రయించాలి. ప్రభుత్వ ఉచిత వైద్య సౌకర్యాలు పొందటానికి ఎవరికి ఎలా అర్జీ వ్రాయాలి, నోట్లు, దస్తావేజులు, ఒప్పందాలు, పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలా వ్రాయాలి వాటి వివిధ నమూనాలు అనేక చట్టాల వివరాలు ఇలాంటివెన్నో మీకు ఉపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300 పేజీల పుస్తకం. ధర రూ. 12. పోస్టుఖర్చులదనం. దేశసేవ ప్రచురణలు, 2. ఇందిరానగరు, వెంగళరావు నగరువద్ద, హైదరాబాదు-500890 కు ఉత్తరం వ్రాసి మీ ఉపయోగానికో పుస్తకం వి.పి. పోస్టుద్వారా పొందండి